వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

## ఏజెన్సీలో పోలీసుల ముమ్మర తనిఖీలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 31: వెంకటాపురం నూగూరు మండలంలోని కొత్తపల్లి క్రాస్‌రోడ్డు ప్రధాన రహదారి సమీపంలో వెంకటాపురం ఎస్సై రేఖ అశోక్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం నుంచి వెంకటాపురం మండలానికి వచ్చి తిరిగి వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం

వెంకటాపూర్, మార్చి 31: మండలంలోని నర్సాపూర్‌లో అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం బొచ్చు రాజు, బొచ్చు అశోక్ రూ.లక్షా 10వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షుడు కలువాల సంతోష్, ఉపాధ్యక్షుడు రాజేందర్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

**బహిరంగ ప్రకటన**

ఇందుములమూగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లయింట్లు అయిన శ్రీమతి గుడెపు జ్యోతి, W/o లేట్ సాంబశివ రావు మరియు శ్రీమతి గుడెపు స్నేహ సాయి, D/o లేట్ సాంబశివ రావు, R/o మంథని గారు లేట్ సాంబశివ రావు గారు వారసులు మరియు సాంబ శివ రావు గారికి సంబంధించిన ఉమ్మడి కుటుంబ ఆస్తులలో సమాన హక్కుదారులు. వారికి సంబంధించిన భూమి సర్వే నెం. 116 విస్తీర్ణం 3.20 గుంటలు మరియు 409 విస్తీర్ణం 7.02 గుంటలు మొత్తం విస్తీర్ణం 10.22 గుంటలు చింతకాని శివారునందలి చింతకాని వాస్తవ్యులు అయిన దూలం రాజమౌళి, బుర్రి లక్ష్మీనారాయణ మరియు తాటి బాపు అను వారు కొన్ని తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి తమ పేరు మీద నా క్లయింట్లు అనుమతి లేకుండా మోసపూరితంగా రిజిస్ట్రేషన్ చేయించుకొని నా క్లయింట్లు గౌరవ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భూపాలపల్లి యందు O.S no. 640 of 2022 అను కేసు వేసినారు సదరు కేసు కోర్టు పరిశీలనలో వుండగా పై తెలిపిన వ్యక్తులు దూలం రాజమౌళి, బుర్రి లక్ష్మీనారాయణ మరియు తాటి బాపు అను వారు సదరు భూమిని ఇతరులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు నా క్లయింట్లు దృష్టికి వచ్చినది. కావున కోర్టు విచారణలో వుండగా, నా క్లయింట్లు అనుమతి లేకుండా సదరు ఆస్తి పైన ఎవరైనా ఎటువంటి లావాదేవీలు చేసినచో అవి చట్టరీత్యా చెల్లనేరవు, మరియు వారు తదుపరి నాక్లయింట్లు చట్టరీత్యా తీసుకోనేబోవు చర్యలకు బాధ్యులు కాగలరని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది.
తేది:30-03-2024 మంథని

Sd/- K.V.L.N. HARI BABU
Advocate,Manthani
Cell: 9014222255

**బహిరంగ ప్రకటన**

ఇందుములమూగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా నా యొక్క క్లైయింట్ అయిన శ్రీ గౌని రాజబాపు తన తండ్రి గారైన లేట్ గౌని చంద్రయ్య గారికి సంబంధించిన ఉమ్మడి కుటుంబ ఆస్తులలో తన సోదరులు గౌని సుధాకర్, ధనంజయ్ ల తోపాటు సమాన హక్కుదారులు. వారికి సంబంధించిన భూమి సర్వే నెంబర్ 54/1 adm 116 విస్తీర్ణం 0.30 గుంటలు కాటారం గ్రామం & మండలం శివారు నందలి నా క్లైయింట్ సోదరుడు అయిన గౌని సుధాకర్ కొన్ని తప్పుడు డాకుమెంట్లు సృష్టించి తన పేరు మీద నా క్లైయింటు అనుమతి లేకుండా మోసపూరితంగా మార్చుకొనినందున నా క్లైయింట్ గౌరవ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు భుపాలపల్లి యందు O.S no. 65 of 2023 అను కేసు వేసినారు సదరు కేసు కోర్టు పరిశీలనలో వుండగా పై తెలిపిన వ్యక్తులు గౌని సుధాకర్, ధనంజయ్ అను వారు సదరు భూమిని ఇతరులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నట్లు నా క్లైయింట్ దృష్టి కి వచ్చినది, కావున కోర్టు విచారణలో వుండగా, నా క్లైయింట్ అనుమతి లేకుండా సదరు ఆస్తి పైన ఎవరైనా ఎటువంటి లావాదేవీలు చేసినచో అవి చట్టరీత్యా చెల్లనేరవు, మరియు వారు తదుపరి నాక్లైయింటు చట్టరీత్యా తీసుకోనేబోవు చర్యలకు బాధ్యులు కాగలరని ఈ ప్రకటన ద్వారా హెచ్చరించడమైనది.
తేది:30-03-2024 మంథని

Sd/- K.V.L.N. HARI BABU
Advocate,Manthani
Cell: 9014222255

# ఎండిపోతున్న గోదావరి

- ఎగువ నుంచి తగ్గిన వరద
- దేవాదుల ఎత్తిపోతల మోటర్లు బంద్

సమ్మక్క బరాజ్ వద్ద ఎండిపోయిన గోదావరి నది

కన్నాయిగూడెం, మార్చి 31: మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో ఐదు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ జరుగుతుండగా ఆదివారం అన్నింటినీ బంద్ చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. కొన్నిరోజులుగా ఎగువ నుంచి గోదావరిలోకి వస్తున్న వరద నీరు తగ్గుతోంది. దీంతో సమ్మక్క బరాజ్ అన్ని గేట్లను బంద్ చేసినప్పటికీ గోదావరి నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతూ 73.6 మీటర్లకు చేరింది. ఎగువన ఉన్న దేవాదుల ఎత్తిపోతలకు నీరు అందే పరిస్థితి లేకపోవడంతో మోటర్లను బంద్ చేయడం తప్పనిసరైంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో బరాజ్ గేట్లను ఆపరేట్ చేయడం, మోటర్లను ఆన్ ఆఫ్ చేయడం జరుగుతుందని డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు. గత ఏడాది ఇదే నెలలో నీటితో కళకళలాడిన సమ్మక్క బరాజ్ ఇప్పుడు ఎండిపోయి కనిస్తోంది. వేసవికి ముందు ఇలాంటి పరిస్థితి బరాజ్ నిర్మాణం జరగకముందు గోదావరిలో ఏర్పడేది.

దేవాదుల ఎత్తిపోతల వద్ద గోదావరి

# సింగరేణిలో పెరిగిన రాజకీయ జోక్యం

- మూడు నెలలు గడుస్తున్న గుర్తింపు పత్రం ఇవ్వడం లేదు
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

భూపాలపల్లి రూరల్, మార్చి 31: సింగరేణిలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా రాజకీయ జోక్యం పెరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్ సింగరేణి ఇల్లెందు క్లబ్‌హౌస్ లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌లో ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో నూతన గనులు వస్తేనే భవిష్యత్తు బాగుంటుందని, కొత్త గనుల ఏర్పాటు కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. సింగరేణిలో మునుపెన్నడూ లేని విధంగా రాజకీయ జోక్యం పెరిగిందన్నారు. తాడిచర్ల ఓసీ-2,ఇల్లెందు కోయగూడెం ఓసీ-3, సత్తుపల్లి శ్రావణిపల్లి కేటీకే-6 ఇంక్లైన్ బావులను సింగరేణి ఆధ్వర్యంలో బొగ్గు తవ్వాలని గుర్తింపు సంఘంగా యాజమాన్యాన్ని కోరినట్లు తెలిపారు. త్వరలోనే నూతన బావులు ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా గెలిచి మూడు నెలలు గడుస్తున్నా సింగరేణి యాజమాన్యం రాజకీయాలు చేస్తూ గుర్తింపు పత్రం ఇవ్వడం లేదని తెలిపారు. అనంతరం కార్మికుల చట్టాలు- లేబర్ కోడ్‌ల గురించి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్, కార్మికవర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, నాయకత్వ బాధ్యతల గురించి ఏఐటీయూసీ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు బోసు, మతము, మతోన్మాదం- లౌకికత్వం గురించి ప్రొఫెసర్ శంకర్‌నారాయణ వివరించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ సెక్రటరీ రమేశ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మిరియాల రంగయ్య, మాతంగి రామచందర్, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఒకరిపై హత్యా యత్నం.. మరొకరిపై దాడి కేసు

**ఇంచర్ల ఘటనపై వివరాలు వెల్లడించిన ఎస్సై**

ములుగు రూరల్, మార్చి 31: మండలంలోని ఇంచర్ల గ్రామంలో శనివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడైన మామిడి అశోక్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన శానబోయిన అశోక్ దాడి చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఎస్సై-2 రామకృష్ణ వివరాలను వెల్లడించారు. మామిడి అశోక్ ప్రభుత్వ భూమిలో మట్టిని టిప్పర్లతో తరలిస్తున్నాడంటూ శానబోయిన అశోక్ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య కక్షలు పెరిగిపోయాయి. శనివారం గ్రామంలో ఓ శుభ కార్యం వద్దకు వెళ్లే క్రమంలో ఇరువురు ఎదురుపడగా మాటామాట పెరిగింది. శానబోయిన అశోక్ కత్తితో మామిడి అశోక్‌పై దాడికి యత్నించగా అడ్డుకోబోయిన మామిడి అశోక్ భార్య వసంతకు కత్తివేటు పడి గాయమైంది. అనంతరం మామిడి అశోక్ సైతం శానబోయిన అశోక్ ఇంటి వద్దకు వెళ్లి అతడి కారుతోపాటు బైక్‌ను ధ్వంసం చేశాడు. ఇరువురు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేయగా ములుగు పోలీసులు శానబోయిన అశోక్‌పై హత్యాయత్నం కేసు, మామిడి అశోక్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఈ రెండు కేసులపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

## గొత్తికోయగూడెం చుట్టూ అటవీశాఖ కందకాలు

ఏటూరునాగారం, మార్చి 31: మండలంలోని ఓ గొత్తికోయగూడెం చుట్టూ అటవీశాఖ అధికారులు జేసీబీతో కందకాలు తవ్వించారు. అడవిని నరికేయకుండా చిన్నబోయినపల్లి గ్రామ పంచాయతీ పరిధి చింతలమోరి గొత్తికోయగూడెం చుట్టూ ఇలా చేశారు. కందకాలతో తాము ఇబ్బందులు పడుతున్నామని గొత్తికోయలు మొర పెట్టుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చిటమట రఘు, వావిలాల ఎల్లయ్య, వంగపండ్ల రవి, ముక్కెర లాలయ్య గొత్తికోయగూడేనికి వెళ్లారు. అటవీశాఖ అధికారులు, గొత్తికోయలను సమన్వయం చేశారు. అడవులను నరికేయొద్దని, కొత్తగా పోడు కొట్టొద్దని గొత్తికోయలకు సూచించారు. రైతులు సాగు చేసుకుంటున్న పోడు భూములను తీసుకోవద్దని అటవీశాఖ అధికారులను కోరారు.

అటవీశాఖ అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాజేశ్వరరావు

## అంబట్‌పల్లిలో కార్డన్ సెర్చ్

మహదేవపూర్, మార్చి 31: మండలంలోని అంబట్‌పల్లిలో ఆదివారం సీఐ రాజేశ్వరరావు, సీఆర్పీఎఫ్ సీఐ భాస్కరన్, ఎస్సై ప్రసాద్ పోలీసులతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. 25లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. వాహన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి సరైనవిలేని 16 మంది వాహనదారులకు జరిమానా విధించారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్టులను పెట్టొద్దన్నారు. అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

## దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

కోగిల మహేశ్

ములుగు రూరల్, మార్చి 31: మండలంలోని ఇంచర్లలో బీఆర్‌ఎస్ నాయకుడు మామిడి అశోక్, అతడి భార్యపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీకి చెందిన శానబోయిన అశోక్‌పై కఠినచర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కోగిల మహేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పోలీసులు వెంటనే నిందితుడిని అరెస్ట్ చేసి శిక్షించాలన్నారు. జరిగిన ఘటనపై వీడియోలు, ఫొటోల ఆధారంగా కేసును సుమోటోగా స్వీకరించి దర్యాప్తు చేపట్టాలన్నారు. అడ్డువెళ్లిన మహిళపై కత్తివేటు పడిందని తెలిపారు. నిందితుడిని కఠినంగా శిక్షించి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చేయాలని కోరారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం, మార్చి 31: మండలంలోని గంగారం, విలాసాగర్, ధన్వాడ, వీరాపూర్‌లలో వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను రాష్ట్ర ఐటీ, పరిశ్రల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు శనివారం పరామర్శించారు. విలాసాగర్‌లో పెద్దపల్లి సమ్మక్క మృతదేహానికి పూలమాల వేసి శ్రీనుబాబు నివాళులర్పించారు. విలాసాగర్‌లో మాజీ సర్పంచ్ అందె సత్యనారాయణ భార్య అందె సునీత ఇటీవల మృతిచెందగా ఆ కుటుంబంను పరామర్శించారు. ఇటీవల పలు కారణాలతో గంగారంలో అంగన్‌వాడీ టీచర్ జిల్లెల్ల విజయ నిర్మల, వలి హైదర్, వీరాపూర్‌లో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గద్దల చిలకమ్మ భర్త గద్దల సమ్మయ్య, ధన్వాడలో నిమ్మల నర్సమ్మ మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ నేతలతో కలిసి శ్రీనుబాబు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి విలాస్‌రావు, మండల అధ్యక్షుడు చీమల సందీప్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, నాయకులు దేవేందర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సాగర్ రావు, సత్యనారాయణ, శశికుమార్, రాజు, రాజనర్సయ్య, అంగజాల అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

## డిగ్రీలో ప్రవేశాల కోసం విస్తృత ప్రచారం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సురేందర్, అధ్యాపకులు

ఏటూరునాగారం, మార్చి 31: డిగ్రీలో ప్రవేశాలు కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆదివారం ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. ప్రిన్సిపాల్, అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి సురేందర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యార్థుల ఇళ్లకు వెళ్లారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశం పొంది మూడో సంవత్సరం పూర్తయ్యేలోగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు లభించేలా ప్రిన్సిపాల్ జే చిన్న ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సురేందర్ పిలుపునిచ్చారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇళ్లకు వెళ్లి కళాశాలలో ప్రవేశం పొందాలని కోరుతూ అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు పోస్టర్లను ఆవిష్కరించారు. కళాశాలలో అధ్యాపక బృందం రవీందర్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు. ప్రిన్సిపాల్ చిన్న, వరంగల్, హనుమకొండ అధ్యాపకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, స్థానిక అధ్యాపకులు రవికుమార్, రామకృష్ణారెడ్డి, రమేశ్, రవీందర్, నవీన్, సంపత్, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాలాజీ మున్నూరు కాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

భిక్షపతి, అధ్యక్షుడు,

జయాకర్, ఉపాధ్యక్షుడు

ములుగు రూరల్, మార్చి 31: శ్రీ బాలాజీ మున్నూరు కాపు సహకార పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం ఆవరణలో 20వ వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు నూతన అధ్యక్షుడిగా చింతనిప్పుల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా గండ్రత్ జయాకర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**అబ్బాపురం మున్నూరుకాపు సంఘం నూతన కమిటీ..**

ములుగు మండలం అబ్బాపురం గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కమిటీని ఆదివారం గాడె రాములు, సుంకరి తిరుపతి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లెల ఆనందం, ఉపాధ్యక్షుడిగా సూరంపెద్ది కొమురయ్య, కార్యదర్శి ఆదితోట లింగమూర్తి, సహాయ కార్యదర్శిగా తోట రాజేందర్, కోశాధికారిగా నల్లెల్ల శంకరయ్య, గౌరవ సలహాదారులుగా అనుమాండ్ల సుధాకర్, సూరం చిన్న కొమురయ్య, కమిటీ సభ్యులుగా లింగస్వామి, సూరం సుధాకర్, రాజేంద్రరావు, చొక్కారావు, మనోహర్‌రావు, దేవేందర్, సుధాకర్, జగ్గారావు, కిషన్, శంకరయ్యను ఎన్నుకున్నారు.

# నూతన జడ్జిగా ఎస్‌వీపీ సూర్యచంద్రకళ

జడ్జి సూర్యచంద్రకళను సన్మానిస్తున్న ఉద్యోగ విరమణ పొందిన జడ్జి లలితాశివజ్యోతి, న్యాయవాదులు

ములుగు రూరల్, మార్చి 31: ములుగు జిల్లా కోర్టులో ప్రధానన్యాయమూర్తి పీవీపీ లలితాశివజ్యోతి ఆదివారం ఉద్యోగ విరమణ పొందారు. జిల్లా కోర్టులో ఆమెను పతీసమేతంగా సన్మానించి వీడ్కోలు పలికారు. రాష్ట్ర హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ ములుగు జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎస్‌వీపీ సూర్యచంద్రకళను ఇటీవల నియమించారు. ఆమె ఆదివారం ములుగు కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగ విరమణ పొందిన జడ్జి సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. న్యాయవాదులు నూతన న్యాయమూర్తికి పూలమొక్కను అందించి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. జడ్జిలు మాధవి, రామ్మోహన్‌రెడ్డి, శౌఖ్య, అధ్యక్షుడు మస్రగాని వినయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు బజారు శ్యామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కన్నోజు సునిల్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు రాధారపు శ్రీనివాస్, పి.రాంసింగ్, మహిళా ప్రధాన కార్యదర్శి మేకల మానస, కోశాధికారి బానోత్ స్వామిదాస్, సాంస్కృతిక క్రీడల కార్యదర్శి ఓరుగంటి రాజేందర్, ఈసీ మెంబర్లు బెక్కం నవత, బల్ల ప్రతాప్, సుస్మిత, సంజీవ, అశోక్, ఎక్స్ అఫీషియో మెంబర్లు నర్సిరెడ్డి, చంద్రయ్య, వేణుగోపాలాచారి, న్యాయవాదులు వెంకటేశ్వర్‌రావు, మేకల మహేందర్, బొల్లి సారంగపాణి, కొండి రవీందర్ పాల్గొన్నారు.

## నిర్మించిన రెండు నెలలకే పగుళ్లు

బయ్యక్కపేటలో పగుళ్లు తేలిన సీసీ రోడ్డు

తాడ్వాయి, మార్చి 31: మండలంలోని బయ్యక్కపేటలో అంతర్గత రహదారులు నిర్మించిన రెండు నెలలకే పగుళ్లు తేలాయి. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.20లక్షలతో 400 మీటర్ల రోడ్లను సీసీ రోడ్లుగా మార్చింది. అధికారులు పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం వహించగా కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. క్యూరింగ్ చేయకపోవడంతో సీసీ రోడ్లు పగుళ్లు తేలాయి. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేసిన తర్వాతే ఉన్నతాధికారులు బిల్లు చెల్లించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో మహేశ్వరం నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సభ్యులు

## ఎమ్మెల్సీ సురభి వాణీదేవికి సన్మానం

హనుమకొండ, మార్చి 31: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవిని మహేశ్వరం నియోజకవర్గం బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావుకు శనివారం ఢిల్లీలో భారత ప్రభుత్వం భారత రత్న ప్రదానం చేయగా, పీవీ కుటుంబ సభ్యులు అందుకున్నారు. శనివారం శంషాబాద్ ఎయిర్ పోర్టులో ఎమ్మెల్సీ సురభివాణీ దేవిని సన్మానించగా, బ్రాహ్మణ ఐక్య వేదిక నాయకులు ప్రమోద్ కోటార్, మంగు రాఘవరావు, టీబీఎస్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మునిపల్లి శ్రీనివాస్, బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల పేరుతో బెదిరింపులు

సుబేదారి, మార్చి 31: వరంగల్ నగరంలో మావోయిస్టుల పేరుతో రెండు కార్పొరేట్ హాస్పిటల్స్ యజమానులను బెదిరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అజరా హాస్పిటల్, దీపక్ స్కిన్ క్లినిక్ యజమానులకు ఇద్దరు వ్యక్తులు మావోయిస్టు పార్టీకి చందాలు ఇవ్వాలని లేఖలు పంపి, ఫోన్‌లో బెదిరించారు. దీంతో ఆయా హాస్పిటల్ యాజమాన్యాలు ఆదివారం హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాయి. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు. బెదిరించిన వారు మావోయిస్టులా? లేదా నకిలీలా.. అనే కోణంలో ఆరా తీస్తున్నారు.

# మండుతున్న ఎండలు

- అప్పడే పెరిగిన ఉష్ణోగ్రతలు
- విలవిలలాడుతున్న కూలీలు, పశువులు
- మధ్యాహ్నం నిర్మానుష్యంగా రహదారులు


నిర్మానుష్యంగా ఉన్న వాజేడు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి

పనులకు వెళ్లి మధ్యాహ్నం ఇళ్లకు వస్తున్న కూలీలు

వాజేడు, మార్చి 31 : ఎండలు అప్పుడే మండిపోతున్నాయి. ఉదయం 10గంటలు దాటాక నిప్పుల కొలిమిని తలపిస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. భానుడు ఈఏడాది ముందుగానే తీవ్ర రూపం దాల్చడంతో ముఖ్యమైన పనిమీద బయటకు వెళ్లిన వారు, కూలీలు విలవిలలాడుతున్నారు. మధ్యాహ్నం రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రజలు ఇళ్లలో కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు వేసుకొని సేదతీరుతున్నారు. మండల కేంద్రానికి వివిధ పనులపై వచ్చే వారు ఎండ వేడికి చెట్ల కింద కాసేపు ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి, జగన్నాథపురం వై జంక్షన్ వద్ద ఉన్న హైదరాబాద్ టు భూపాలపట్నం 163 జాతీయ రహదారి, బస్టాండ్లలో జనసంచారం లేదు. మండలంలో 35 నుంచి 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదవుతోంది. మిర్చి ఏరేందుకు, గ్రేడింగ్ చేసేందుకు వెళ్లే కూలీలు ఎండకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూగజీవాలు సైతం చెట్ల నీడలో ఉంటూ రక్షణ పొందుతున్నాయి. ఎండలు మార్చి నెలాఖరులోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దు

మాట్లాడుతున్న జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్

ధర్మసాగర్, మార్చి 31: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దని జన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు భరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కడియం శ్రీహరి కాంగ్రెస్ పార్టీ నాయకులపై అక్రమ కేసులు, నిర్బంధాలు పెట్టి మానసికంగా హింసించిన దళిత ద్రోహి అని అన్నారు. రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్ పార్టీని కాదని కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇస్తే ఆ నమ్మకాన్ని సీఎం రేవంత్ రెడ్డి వమ్ము చేస్తున్నారని అన్నారు.

ఆయనను పార్టీలో చేర్చుకోవడం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, విజయ్‌కాంత్ అనే యువకుడు కడియం శ్రీహరిని పార్టీలోనికి చేర్చుకోవద్దని పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్య యత్నించాడు. గమనించిన వారు అతడి వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ లాగేసుకున్నారు. సమావేశంలో జన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబరాజ్, సునీల్, భగత్, శ్రీధర్, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏటూరునాగారం, మార్చి 31: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రామాలయం సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు ఎస్సై కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈశిబిరంలో రూ.10,300 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పేకాటలో ముమ్మగాని రమేశ్, సునారికాని నాగరాజును అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పారిపోయినట్లు పేర్కొన్నారు. పేకాటలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మండల నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు వస్తున్న విషయాన్ని గమనించిన ముగ్గురు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. వారి కోసం పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, అదుపులోకి తీసుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పరిమితికి మించి ప్రయాణం

పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో

వాజేడు, మార్చి 31: మండలంలో ప్రైవేట్ వాహనాలు పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్నాయి. కొందరు ఆటోల్లో 20మందికి పైగా ఎక్కించుకుంటున్నారు. సంబంధిత అధికారులు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. గతంలో మండలంలోని మండపాక జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న వాహనాలు పలుమార్లు ప్రమాదాల బారిన పడి కొంతమంది గాయపడ్డారు. ఇదే రహదారిపై పరిమితికి మించి ఏటూరునాగారం మండలం శివపూర్ నుంచి కూలీలను తీసుకొస్తున్న ట్రాలీ బోల్తాపడ్డ ఘటనలో 40 మందికి పైగా గాయపడగా కొందరు మృతిచెందారు. కొందరు వాహనదారులు ఇవేమీ పట్టించుకోవడంలేదు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

LEASE/ RENT
★HNK, ఆదాలత్ నుండి K.L.N రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్ (S.V.కాలనీ) రోడ్ నెం.5, 4 అంతస్థుల భవనం, ప్రతి ఫ్లోర్ 1650 Sft కిరాయి / లీజ్ కి ఇవ్వబడును. (New బిల్డింగ్) సంప్ర|| సెల్ : 9502879612
KMM-11619

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565